సాక్షి

జయశంకర్ భూపాలపల్లి

శుక్రవారం ⁝ 21 ⁝ మార్చి ⁝ 2025



నైపుణ్యాలు పెంచుకోవాలి

ఇంజనీరింగ్ విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవాలని కేయూ రిజిస్ట్రార్ రామచంద్రం అన్నారు. - IIలో▸



వరంగల్ మామిడికి గుర్తింపు

వరంగల్ నుంచి ఎగుమతి అయ్యే మామిడికి దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందని రాష్ట్ర అటవీ శాఖ మంత్రి సురేఖ అన్నారు. - IIలో▸

గరిష్టం/కనిష్టం

35^0 / 24^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. పలుచోట్ల ఆకాశం మేఘావృతమై ఉంటుంది. రాత్రి ఆహ్లాదకరంగా మారుతుంది.

ఇఫ్తార్	సహర్
శుక్ర	శని
6:32	4:57

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

భూపాలపల్లి రూరల్: డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు యువత, విద్యార్థులు మాదక ద్రవ్యానికి దూరంగా ఉండి, ఉజ్వల భవిష్యత్ కోసం బాటలు వేసుకోవాలని ఎస్పీ కిరణ్ ఖరే గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గంజాయి, డ్రగ్స్ మహమ్మారిని ప్రారంభ దశలోనే గుర్తించి, నివారించాలని తెలిపారు. యువత మాదకద్రవ్యాలకు అలవాటు పడడం వల్ల ఆరోగ్యం క్షీణిస్తుందని తెలిపారు. నేర ప్రవృత్తి వైపు దారితీస్తుందన్న విషయం గమనించాలని పేర్కొన్నారు. తద్వారా కుటుంబ సభ్యులు, బంధువులకు దూరమవుతారని తెలిపారు. జిల్లాలో డ్రగ్స్, గంజాయి సంబంధిత సమాచారం తెలిస్తే 87126 58111 నంబర్ ద్వారా సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్పీ పేర్కొన్నారు. డ్రగ్స్, గంజాయి లాంటి మత్తు పదార్థాలు విక్రయిస్తే చట్ట పరంగా కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

భూపాలపల్లి రూరల్: అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సునీత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యాసంవత్సరంలో విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించే జిల్లాలోని షెడ్యూల్డ్ కులాల విద్యార్థులు ఈ విద్యానిధికి www. telanganaepass. cgg. gov. in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మార్చి 20వ తేదీ నుంచి మే 19వ తేదీ వరకు దరఖాస్తులకు అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. సందేహాల నివృత్తికి ఫోన్ నంబర్ 99088 43340 ద్వారా సంప్రదించాలని కోరారు.

పెట్రోల్ బాటిల్‌తో వ్యక్తి హల్‌చల్



మల్హర్: మండలంలోని తాడిచర్ల తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఓ వ్యక్తి పెట్రోల్ బాటిల్‌తో హల్‌చల్ చేశాడు. కొయ్యూరు ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వల్లెకుంట గ్రామానికి చెందిన నార శంకర్ కొంత కాలంగా భూమి పట్టా చేయాలంటూ కార్యాలయం చుట్టూ తిరుతున్నాడు. కాగా గురువా రం తహసీల్దార్ కార్యాలయానికి పెట్రోల్ బాటి ల్‌తో వచ్చి ఆర్‌ఐ రాజశేఖర్, జూనియర్ అసిస్టెంట్‌తో వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలో తన రికార్డులు రెవెన్యూ సిబ్బంది తారుమారు చేశారని ఆరోపణలు చేస్తూ వెంట తెచ్చుకున్న పెట్రోల్ బాటిల్‌ను ఆర్‌ఐ టేబుల్ మీద గట్టిగా కొట్టాడు. దీంతో టేబుల్ మీద ఉన్న రికార్డులతోపాటు ఆర్‌ఐ రాజశేఖర్, జూనియర్ అసిస్టెంట్ కీర్తన మీద కొంత పెట్రోల్ డ్రాప్స్ పడ్డాయి. లైటర్‌తో వెలిగిస్తాని భయభ్రాంతులకు గురి చేయడంతో తాము వేరే రూములోకి వెళ్లినట్లు ఆర్‌ఐ రాజశేఖర్ వెల్లడించారు. అప్రమత్తమై పోలీసులకు సమాచార అందించామని, సదరు వ్యక్తిని పట్టుకోవడానికి ప్రయత్నించగా పారిపోయినట్లు పేర్కొన్నారు. తమ విధులకు ఆటకం కలిగించి, హత్యాయత్నం చేశాడని శంకర్‌పై చర్యలు తీసుకోవాలని ఆర్‌ఐ రాజశేఖర్, జూనియర్ అసిస్టెంట్ కీర్తన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కొయ్యూరు ఎస్సై నరేష్ తెలిపారు.

బడ్జెట్ కేటాయింపులో బీసీలకు అన్యాయం

మొగుళ్లపల్లి: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 2025–2026 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌లో బీసీలకు అన్యాయం చేసిందని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్‌గౌడ్ ఆరోపించారు. గురువారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ.3,04,965 కోట్ల మొత్తం బడ్జెట్‌లో 56 శాతం పైగా ఉన్న బీసీలకు కేవలం 3.6శాతం రూ.11,405 ఓట్లు కేటాయించి బీసీలను అవమానపరిచారని ఆయన మండిపడ్డారు. బీసీలకు స్థానిక సంస్థలు, విద్య, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తామని అసెంబ్లీలో బిల్లు పెట్టి ఆమోదింపజేసిన ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుల్లో మాత్రం ఎందుకింత వివక్షత చూపుతుందని ప్రశ్నించారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకారం ప్రతి సంవత్సరం బీసీలకు రూ.20 వేల కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని చెప్పి ఇప్పుడు మాట మార్చడం సరికాదన్నారు.



ప్రణాళిక సిద్ధం

ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు

- జిల్లాలో లక్షా 30వేల మెట్రిక్ టన్నుల లక్ష్యం
- 205 కేంద్రాల ఏర్పాటుకు చర్యలు
- డిమాండ్ ఉన్న గ్రామాల్లో కేంద్రాలు

భూపాలపల్లిరూరల్: యాసంగి వరి ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈమేరకు జిల్లాలో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వానాకాలంతో పోలిస్తే సాగు విస్తీర్ణం తగ్గినా కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ఎప్పటిలాగే చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. వారం పదిరోజుల్లో కోతలు ప్రారంభం కానున్నందున అప్పటివరకు గన్నీబ్యాగులు, కాంటాలు, టార్పాలిన్లు, తేమశాతం కొలిచే యంత్రాలను సమకూర్చుకోవాలని కొనుగోలు కేంద్రాలవారికి సూచిస్తున్నారు. వానాకాలం మాదిరిగానే డిమాండ్ మేరకు ప్రతి గ్రామంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రూపొందించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లాలో 205 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు కావాల్సిన సౌకర్యాలను సమకూర్చుకునేందుకు అధికారులు సమాయత్తమయ్యారు.

87,500 ఎకరాల్లో వరి సాగు

ప్రస్తుత యాసంగిలో జిల్లాలో సుమారు 87,500 ఎకరాల్లో వరి సాగైంది. సంబంధిత అధికారుల అంచనా ప్రకారం గరిష్టంగా లక్షా 30వేల మెట్రిక్ టన్నులు దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ఇందుకు 32లక్షల గన్నీ బ్యాగులు అవసరముండగా 4 లక్షలు గన్నీ సంచులు అందుబాటులో ఉన్నాయి. మిగితా గన్నీ బ్యాగుల కోసం ప్రభుత్వానికి నివేదిక పంపించినట్లు అధికారులు తెలిపారు.

ఏర్పాట్లలో నిమగ్నం

సివిల్ సప్లయీస్, ఐకేపీ, సహకార శాఖల అధికారులు, సిబ్బంది యాసంగిలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు పనిలో నిమగ్నమయ్యాయి. ఏప్రిల్ మొదటి వారంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, కోతలు ప్రారంభమైన గ్రామాల్లో వెంటనే కేంద్రాలు ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశాలిచ్చాడు. దీంతో అధికారులు ట్రాన్స్‌పోర్టు, గన్నీ బ్యాగులు, హమాలీలు, కాంటాలు, రైస్ మిల్లుల కేటాయింపులు, ఇతరత్రా సామగ్రిని సమకూర్చుకునే పనిలో పడ్డారు. జిల్లా వ్యాప్తంగా ఐకేపీ ఆధ్వర్యంలో 30 కేంద్రాలు, పీఏసీఎస్ 155, డీసీఎంఎస్ 20, మొత్తం 205 కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఈ ఏడాది వానాకాలంలో 1.04 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోళ్లు చేశారు. అందుకు రూ.240 కోట్లు రైతుల ఖాతాల్లో జమచేశారు.

సౌకర్యాల కల్పనకు ఏర్పాట్లు..

వారం రోజుల క్రితం కలెక్టర్ రాహుల్ శర్మ, అదనపు కలెక్టర్ అశోక్.. సంబంధిత అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. వేసవి నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలుగకుండా తాగునీటితోపాటు, నీడకు పందిర్లు, లేదా టెంట్లు వేయాలని, అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. వచ్చింది వచ్చినట్లుగా ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశాలిచ్చారు.

కేంద్రాల ఏర్పాటుకు చర్యలు



జిల్లాలో రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తి స్థాయిలో కొనుగోలు చేసేందుకు కలెక్టర్, అదనపు కలెక్టర్ సారథ్యంలో ప్రణాళిక రూపొందించాం. వానాకాలం మాదిరిగా గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తాం. కోతలు ప్రారంభం అవుతున్న ప్రాంతాల వారీగా ధాన్యం కేంద్రాలను ప్రారంభించి కొనుగోళ్లు చేస్తాం.

– రాములు, డీఎం, పౌరసరఫరాలశాఖ

మే 10లోపు పనులు పూర్తి చేయాలి

- మే 15 నుంచి 26 వరకు సరస్వతి పుష్కరాలు
- ఏర్పాట్లను పరిశీలించిన దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్
- కాళేశ్వరం ఈఓ కార్యాలయంలో అధికారులతో సమీక్ష



ఇరిగేషన్ అధికారులకు సూచనలిస్తున్న శైలజారామయ్యర్

కాళేశ్వరం: మే 10 లోపు పనులన్నీ పూర్తి చేసి సరస్వతి నది పుష్కరాలకు సిద్ధం కావాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లను రాష్ట దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్ ఆదేశించారు. మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో మే 15 నుంచి 26వ తేదీ వరకు జరగనున్న సరస్వతి పుష్కరాల ఏర్పాట్లను దేవాదాయశాఖ కమిషనర్ శ్రీధర్, కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరేలతో కలిసి గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా వీఐపీ ఘాట్ వద్ద మెట్ల నిర్మాణ పనులను పరిశీలించారు. 150మీటర్ల పొడవు మెట్లను 86మీటర్ల పొడవుకు కుదించిన విషయమై చర్చించారు.

ఘాట్ వద్ద రహదారి

వీఐపీ ఘాట్ వద్ద రూ.కోటితో కొనసాగుతున్న సరస్వతి విగ్రహం, సుందరీకరణ పనులు పరిశీలించి, విగ్రహ ఏర్పాటుకు స్థలం నిర్ణయించారు. వీఐపీ ఘాట్ నుంచి గోదావరి ఘాట్ వరకు గోదావరిలో కర్రలు లేదా స్టీల్‌తో రహదారి నిర్మాణం చేపట్టాలన్నారు. పురుషులు, మహిళల కోసం వేర్వేరుగా శాశ్వత మరుగుదొడ్ల నిర్మాణం వంటి అంశాలపై సమీక్ష నిర్వహించారు. పుష్కరాల్లో 12 రోజుల పాటు గోదావరి హారతి నిర్వహించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

భక్తులకు ఇబ్బందులు కలగొద్దు

భక్తులకు ఇబ్బందులు కలగకుండా సమగ్ర ప్రణాళిక, సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పూర్తి చేయాల్సిన శాశ్వత, తాత్కాలిక పనులకు ముందుగానే షెడ్యూల్ తయారు చేసుకోవాలని, సిబ్బందిని ఎక్కువ సంఖ్యలో నియమించుకోవాలని పెంచాలని సూచించారు. అంచనాల్లో వ్యత్యాసాలతో చేపట్టే పనులపై రెండు రోజుల్లో నివేదికలు అందచేయాలని సూచించారు.

పుష్కరాలకు ప్రత్యేక యాప్

పుష్కర సమాచారం తెలిసేలా ప్రత్యేకంగా యాప్ తయారు చేయాలని, విస్తృత ప్రచారానికి అంబాసిడర్‌ను నియమించాలని తెలిపారు. 12 రోజుల కార్యక్రమాలకు సంబంధించి షెడ్యూల్ తయారు చేయాలని ఈఓ మహేష్‌ను ఆదేశించారు. వేసవి దృష్ట్యా గోదావరిలో చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. గోదావరిలో నీటి నిల్వలను పరిశీలించాలన్నారు. అన్న సత్రాన్ని అందుబాటులోకి తేవాలని సూచించారు. ప్రసాదాల కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. భక్తులు గోదావరిలోకి వెళ్లకుండా ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. ఆర్టీసీ బస్సులు నిలిపే ప్రదేశం, 86గదుల వసతి గృహాన్ని పరిశీలించారు. సమీక్షలో సమావేశంలో కలెక్టర్ రాహుల్ శర్మ, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఇంజనీరింగ్ శాఖల ద్వారా చేపట్టనున్న పనుల ప్రగతిని వివరించారు. కాటారం సబ్‌కలెక్టర్ మయాంక్‌సింగ్, దేవాదాయశాఖ ఆర్జేసీ రామకృష్ణారావు, ఏసీ సునీత, ఈఓ మహేష్, డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, సీఐ రామచందర్‌రావు, ఎస్సైలు తమాషారెడ్డి, పవన్ పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధివైపు అడుగులు పడట్లే!

జీడీడీపీలో వెనుకబడిన ఓరుగల్లు..అట్టడుగున ఆరు జిల్లాలు..

- తలసరి ఆదాయంలో పుంజుకున్న భూపాలపల్లి
- 15 నుంచి 12 స్థానానికి పెరిగిన వైనం.. గతంతో పోలిస్తే పరవాలేదు
- అడవుల విస్తీర్ణంలో ములుగు ఫస్ట్.. మూడో స్థానంలో భూపాలపల్లి
- తెలంగాణ సోషియో ఎకనామిక్ అవుట్‌లుక్ – 2025లో వెల్లడి



జిల్లా స్థూల దేశీయోత్పత్తి (జీడీడీపీ)లో ఉమ్మడి వరంగల్ పరిధిలోని ఆరు జిల్లాలు ఈసారి కూడా వెనుకబడ్డాయి. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో విడుదల చేసిన తెలంగాణ సామాజిక-ఆర్థిక దృక్పథ నివేదిక - 2025 గణాంకాలు ఆందోళన కలిగిస్తున్నాయి. జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలో 32, 33వ స్థానంతో అట్టడుగున నిలిచాయి. ఈ జిల్లాల వృద్ధి రేటు రాష్ట్ర వ్యాప్తంగా వెనకబడి ఉంది. 2022-23 సంవత్సరాలకు ప్రస్తుత ధరల్లో జీడీడీపీ విలువ పెరుగుదల కనిపించినప్పటికీ రాష్ట్రస్థాయిలో మిగతా జిల్లాలతో పోలిస్తే చాలా వెనుకబడ్డాయి. ఉమ్మడి జిల్లా పరిస్థితులపై రాష్ట్ర ఆర్థిక, గణాంక శాఖ విడుదల చేసిన "తెలంగాణ సామాజిక-ఆర్థిక దృక్పథ నివేదిక - 2025" గణాంకాల ఆధారంగా ప్రత్యేక కథనం IIలో▶

– సాక్షి ప్రతినిధి, వరంగల్

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



గొల్లబుద్దారంలో సీసీ రోడ్డుపనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

భూపాలపల్లి రూరల్: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే మారుమూల అటవీ గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందాయని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గురువారం డీసీసీ అధ్యక్షుడు, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాశ్ రెడ్డితో కలిసి భూపాలపల్లి మండలంలో రూ.4.73 కోట్లతో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజా ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ గ్రామాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రతి ఒక్కరికీ అందించేలా చూస్తున్నామన్నారు. మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఇందిరమ్మ రాజ్యం, ప్రజా ప్రభుత్వం వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, బస్సులకు మహిళలను ఓనర్లను చేసినట్లు తెలిపారు. ప్రతీ మహిళ ఆర్థికంగా ఎదగాలని, ప్రతి కుటుంబం అభివృద్ధి చెందాలని, అన్ని రంగాల్లో వారిని ముందంజలో ఉంచాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా.. వివిధ గ్రామాలకు చెందిన మొత్తం 12 మంది సీఎంఆర్‌ఎఫ్ లబ్ధిదారులకు ఎమ్మెల్యే చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో మండలపార్టీ అధ్యక్షుడు సుంకరి రామచంద్రయ్యతోపాటు ఆయాగ్రామాల్లోని పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులు ధైర్యంగా పరీక్షలు రాయాలి

- కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి రూరల్: నేటినుంచి 10వ తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో కలెక్టర్ రాహుల్ శర్మ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలుపుతూ.. క్రమశిక్షణతో, ధైర్యంగా పరీక్షలు రాయాలని గురువారం ఒక ప్రకటనలో సూచించారు. ప్రశాంతమైన మనసుతో పరీక్షలు రాస్తే తప్పకుండా మంచి ఫలితాలు సాధిస్తారని తెలిపారు. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామని, ఈ నెల 21వ తేది నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు పరీక్షలు జరుగనున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 3,449 మంది విద్యార్థులు పరీక్షలకు రాయనున్నట్లు వివరించారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందని, విద్యార్థులను ఉదయం 9 గంటల నుంచే కేంద్రాల్లోకి అనుమతిస్తారని తెలిపారు. 9.35 తదుపరి అనుమతి ఉండదని స్పష్టం చేశారు. విద్యార్థులు సకాలంలో కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. విద్యార్థులతో పాటు విధులు నిర్వహించే సిబ్బందికి సైతం సెల్ ఫోన్లు, చేతి గడియారం, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలతో పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిలేదని, నిశిత పరిశీలన తర్వాతనే కేంద్రాల్లోకి అనుమతిస్తారని తెలిపారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలి

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు




సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు, పక్కన కలెక్టర్

కాటారం: వేసవికాలంలో నియోజకవర్గంలో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ప్రణాళికతో చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశించారు. కాటారం మండల కేంద్రంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో గురువారం జిల్లా కలెక్టర రాహుల్‌శర్మతో కలిసి పలు శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కాటారం, భూపాలపల్లి డివిజన్లలో తాగునీటి సమస్య ఉండకూడదని, అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి సమస్య పరిష్కరించాలని సూచించారు. సబ్‌డివిజన్ పరిధిలో 30 బోర్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేశామని, అవసరం ఉన్న గ్రామాల్లో ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రభుత్వం ద్వారా మంజూరైన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. కాటారం హెడ్ క్వార్టర్స్‌లో మినీ స్టేడియం, చిల్డ్రన్స్ పార్క్ నిర్మాణానికి స్థల సేకరణ చేపట్టాలని, నిర్మాణం పూర్తయిన గ్రామపంచాయతీ భవనాల ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆదేశించారు. పలు గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలని అన్నారు. డివిజన్ కేంద్రంలో మంజూరు చేసిన కూరగాయల మార్కెట్, కమ్యూనిటీ హాల్ నిర్మాణాలకు టెండర్లు పిలిచి పనులు మొదలు పెట్టాలని, అంబులెన్స్, వైకుంఠ రథాల ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్ పనులు వేగంగా చేయాలని, భూ సేకరణ త్వరగా పూర్తి చేయాలన్నారు. ఇసుక లారీల వేగ నియంత్రణకు స్పీడ్ గన్స్, ఇతరాత్ర చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను మంత్రి ఆదేశించారు. సరస్వతి పుష్కరాల ఏర్పాట్లలో వేగం పెంచాలన్నారు. సమీక్ష సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, డీఆర్‌డీఓ నరేశ్, రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ చైర్మన్ అయిత ప్రకాశ్‌రెడ్డి, కాటారం డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి పెద్దపీట

రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. రంజాన్ మాసం పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కాటారం మండల కేంద్రంలోని మజీద్‌లో ముస్లింలకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మంత్రి శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. ముస్లింలతో కలిసి మంత్రి మజీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఇఫ్తార్ విందులో భాగంగా ముస్లింలకు స్వీట్లు, పండ్లు తినిపించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో ముస్లిం, మైనార్టీలకు పెద్దఎత్తున నిధులు కేటాయించిందన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే, సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ట్రేడ్ ప్రమోషన్ చైర్మన్ అయిత ప్రకాశ్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు సందీప్, సమ్మయ్య, ప్రభాకర్‌రెడ్డి, అజీజ్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రాజేందర్

కాటారం: జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలుర కళాశాల అకాడమీ విద్యార్థులు ఎంపికయ్యారు. జనవరి 18 నుంచి 20వ తేదీ వరకు కరీంనగర్ జిల్లాలో తెలంగాణ రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసిసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్స్ 19 విభాగంలో కరీంనగర్ జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. దీంతో నిర్వాహకులు ఈ జట్టును జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. జట్టులో అత్యంత ప్రతిభ కనబర్చిన కాటారం గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థి టి.జితేందర్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాజేందర్ తెలిపారు. మార్చి 26 నుండి 30వ తేదీ వరకు బీహార్‌లో జరిగే(హెచ్‌ఎఫ్‌ఐ) జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. జితేందర్‌ను ప్రిన్సిపాల్ రాజేందర్, వైస్ ప్రిన్సిపాల్స్ మాధవి, వెంకటయ్య, పీడీ మహేందర్, పీఈటీ శ్రీనివాస్, కోచ్ వెంకటేశ్, డిప్యూటీ వార్డెన్ నరేశ్, ఉపాధ్యాయులు అభినందించారు.


ఖోఖోకు ఎంపికైన ఆనంద్



ఆనంద్

టేకుమట్ల: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న చాగంటి ఆనంద్ జాతీయ స్థాయి సివిల్ సర్వీసెస్ ఖోఖోకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా ఆయన సాక్షితో మాట్లాడుతూ జనవరిలో హైదరాబాద్‌లో జరిగిన ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ తెలంగాణ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చడం ద్వారా నేటి(శుక్రవారం) నుంచి ఈ నెల 24 వరకు ఢిల్లీలో కొనసాగే జాతీయ స్థాయి సివిల్ సర్వీసెస్ ఖోఖోలో తెలంగాణ జట్టులో ఆడనున్నట్లు తెలిపారు.

వర్షం.. జరభద్రం



- నాలుగు జిల్లాలకు పొంచి ఉన్న వాన
- పంటల విషయంలో రైతులు అప్రమత్తం

సాక్షి, వరంగల్: భానుడి భగభగతో కొన్ని రోజులుగా అల్లాడుతున్న ప్రజలు గురువారం ఒక్కసారిగా వాతావరణం చల్లబడడంతో హమ్మయ్యా అని ఊపిరి పీల్చుకున్నారు. గురువారం మధ్యాహ్నం ఒంటిగంట నుంచి ఆదివారం ఉదయం 8.30 గంటల వరకు ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతోపాటు వడగళ్ల వాన కురిసే అవకాశముందని వాతావరణ శాఖ ప్రకటించడతో రైతులు కూడా అప్రమత్తమయ్యారు. ఇప్పటికే ఎండబెట్టిన మిర్చి, వరి, మొక్కజొన్నలను రైతులు బస్తాల్లో నింపుతున్నారు. ఇంకొందరు పరదాలు సిద్ధం చేసుకున్నారు. జయశంకర్ భూపాలపల్లిలో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలుల (గాలి వేగం గంటకు 40 నుంచి 50 కిలోమీటర్లు)తోపాటు వడగాళ్లతో కూడిన వర్షం శుక్ర, శని, ఆదివారాల్లో కురిసే అవకాశముంది. వరంగల్, హనుమకొండ జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలుల (గాలి వేగం గంటకు 30 నుంచి 40 కిలోమీటర్లు)తో కూడిన వర్షం శుక్రవారం ఉదయం 8.30 నుంచి శనివారం ఉదయం 8.30 గంటల మధ్యలో కురిసే అవకాశముంది. శని, ఆదివారాల్లో హనుమకొండ, జనగామ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసే చాన్స్ ఉందని వాతావరణ శాఖ పేర్కొంది.

రైతులు జర జాగ్రత్త..

'జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయి. కోసిన వరి, మొక్కజొన్న, శనగ, పెసర, మినుము, జొన్న, పొద్దుతిరుగుడు, నువ్వులు తదితర పంటలను జాగ్రత్తగా సురక్షిత ప్రాంతాలకు తరలించాలి. మార్కెట్‌కు తరలించిన ధాన్యం తడవకుండా టార్పాలిన్‌తో కప్పి ఉంచాలి. కోతకు సిద్ధంగా ఉన్న టమాట, వంకాయ, బెండకాయ, మిర్చి పంటలు కోయాలి. తాత్కాలికంగా పురుగు మందుల పిచికారీ ఆపాలి. వడగాళ్ల వర్షం కురిసే అవకాశం ఉండడంతో పశువులు, మేకలు, గొర్రెలను సురక్షిత ప్రాంతాల్లో ఉంచాలి' అని వ్యవసాయ అధికారులు సూచించారు.

క్లుప్తంగా

కాజీపేట సబ్ డివిజన్ పరిధిలో నేడు రైల్వే జీఎం పర్యటన

కాజీపేట రూరల్ : కాజీపేట సబ్ డివిజన్ పరిధిలోని పలు సెక్షన్లలో శుక్రవారం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ పర్యటించి తనిఖీ చేయనున్నట్లు రైల్వే అధికారులు గురువారం రాత్రి తెలిపారు. సికింద్రాబాద్‌లో రైల్వే జీఎం ప్రత్యేక రైలులో బయలుదేరి సికింద్రాబాద్–కరీంనగర్ రైల్వే స్టేషన్ల మధ్య గల వయా నిజామాబాద్ మీదుగా కరీంనగర్, రామగుండం, వరంగల్ రైల్వే స్టేషన్లలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులు, రైల్వే స్టేషన్లను తనిఖీ చేసుకుంటూ కాజీపేట జంక్షన్‌కు మధ్యాహ్నం 3 గంటలకు చేరుకుంటారన్నారు. ఇక్కడ లోకోపైలెట్లు, అసిస్టెంట్ లోకోపైలెట్లతో మాట్లాడి పలు రైల్వే సేఫ్టీ విషయాలపై ప్రస్తావించనున్నట్లు తెలిపారు. రైల్వే అధికారులతో కాజీపేట జంక్షన్ కేంద్రంగా జరుగుతున్న రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ, వ్యాగన్ షెడ్ తోపాటు పలు రైల్వే అభివృద్ధి పనులు, కాజీపేట జంక్షన్‌లో జరుగుతున్న అమృత్ భారత్ రైల్వే స్టేషన్ పనులను తనిఖీ చేసి అధికారులతో మాట్లాడే అవకాశం ఉందని చెప్పారు. అనంతరం కాజీపేట జంక్షన్ నుంచి ప్రత్యేక రైలులో సికింద్రాబాద్‌కు వెళ్లనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

పాఠశాలకు వెళ్లమన్నందుకు..

- పురుగుల మందు తాగిన బాలుడు
- పూసలతండాలో ఘటన

గార్ల : పాఠశాలకు వెళ్లమని తల్లిదండ్రులు మందలించడంతో క్షణికావేశానికి గురైన బాలుడు పురుగుల మందు తాగాడు. ఈ ఘటన గురువారం గార్ల మండలం పూసలతండాలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. తండాకు చెందిన ఓ బాలుడు గార్లలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. మూడు, నాలుగు రోజుల నుంచి పాఠశాలకు వెళ్లడం లేదు. దీనిపై తల్లిదండ్రులు మందలించగా పురుగుల మందు తాగాడు. గమనించిన తల్లిదండ్రులు వెంటనే గార్ల సీహెచ్‌సీ తీసుకొచ్చి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం మహబూబాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది. పూర్తి వివరాలు తెలియాల్సివుంది.

ఆర్థికాభివృద్ధివైపు అడుగులు పడట్లే!

జీడీడీపీలో వెనుకబడిన ఓరుగల్లు.. అట్టడుగున ఆరు జిల్లాలు..

తెలంగాణ సోషియో ఎకనామిక్ అవుట్‌లుక్ - 2025లో వెల్లడి



సాక్షి ప్రతినిధి, వరంగల్ : తెలంగాణ సామాజిక–ఆర్థిక దృక్పథ నివేదిక - 2025 గణాంకాలు ఆందోళన కలిగిస్తున్నాయి. జిల్లా స్థూల దేశీయోత్పత్తి (జీడీడీపీ)లో ఉమ్మడి వరంగల్ జిల్లాలు ఈసారి కూడా వెనుకబడ్డాయి. జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలు 32, 33వ స్థానంతో అట్టడుగున నిలిచాయి. ఈ జిల్లాల వృద్ధి రేటు రాష్ట్ర వ్యాప్తంగా వెనుకబడి ఉంది. 2022-23 సంవత్సరాలకు ప్రస్తుత ధరల్లో జీడీడీపీ విలువ పెరుగుదల కనిపించినప్పటికీ రాష్ట్ర స్థాయిలో మిగతా జిల్లాలతో పోలిస్తే చాలా వెనుకబడ్డాయి. జాతీయ ధరల సూచీ ప్రకారం గణించే తలసరి ఆదాయం విషయంలో గతంతో పోలిస్తే కొంత పరవాలేదు. జయశంకర్ భూపాలపల్లి 15 స్థానం నుంచి 12 స్థానానికి చేరింది. అడవుల విస్తీర్ణంలో ములుగు మొదటి, భూపాలపల్లి మూడో స్థానాల్లో నిలిచాయి. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిదినాలను కల్పించడంలో 9 నుంచి 29 స్థానాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలు నిలిచాయి. అయితే ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు ద్వారా నగరాలు, పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి పథంలో సాగుతున్నట్లు పేర్కొన్నారు. మౌలిక వసతులు కల్పన, విద్యుత్ కనెక్షన్లు, మహిళా, శిశు సంక్షేమంలో ప్రగతి సాధించినట్లు పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా పరిస్థితులపై రాష్ట్ర ఆర్థిక, గణాంకశాఖ విడుదల చేసిన 'తెలంగాణ సామాజిక -ఆర్థిక దృక్పథ నివేదిక - 2025' గణాంకాల ఆధారంగా ప్రత్యేక కథనం.

జిల్లాల వారీగా మొత్తం జనాభా, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఇలా..

జిల్లా	మొత్తం జనాభా	గ్రామీణం	పట్టణ/నగరం
హనుమకొండ	10,62,247	4,98,618	5,63,629
వరంగల్	7,37,148	5,10,057	2,27,091
జనగామ	5,34,991	4,63,634	71,357
జేఎస్.భూపాలపల్లి	4,16,763	3,74,376	42,387
మహబూబాబాద్	7,74,549	6,98,173	76,376
ములుగు	2,94,671	2,83,178	11,493

జీడీడీపీలో అట్టడుగున జిల్లాలు..



ఉమ్మడి వరంగల్‌లో ఆరు జిల్లాలు ఉండగా.. జిల్లా స్థూల దేశీయోత్పత్తి (జీడీడీపీ)లో 2022-23 సంవత్సరం కంటే 2023-24లో అట్టడుగున నిలిచాయి. రాష్ట్రంలోని మిగతా జిల్లాలతో ఈసారి కూడా పోటీ పడలేకపోయాయి. వరంగల్ అర్బన్ (హనుమకొండ) గతేడాది రూ.23,868తో 14వ స్థానంలో ఉండగా.. ఈసారి రూ. 25,667కు జీడీడీపీ పెరిగినా 16వ స్థానంలో నిలిచింది. వరంగల్ రూరల్(వరంగల్) 22, మహబూబాబాద్ 24వ స్థానాల్లో నిలిచాయి. జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలో 32, 33వ స్థానంతో ఆఖరి వరుసలో ఉన్నాయి.

ఖనిజ వనరుల ఆదాయంలో ములుగు..



ఖనిజ వనరుల ద్వారా తెలంగాణకు ఆదాయ లక్ష్యం రూ.1,575 కోట్లకు రూ.1,176 కోట్లు సమకూరగా, ములుగు జిల్లాలో రూ.34.94 కోట్లకు రూ.33.86 కోట్లతో నాలుగో స్థానంలో ఉన్నట్లు గణాంకాలు వెల్లడించాయి. ఆ తర్వాత మహబూబాద్ జిల్లా రూ.25.03 కోట్లకు రూ.22.15 కోట్లతో పదో స్థానంలో ఉంది. జేఎస్ భూపాలపల్లి జిల్లా 11, హనుమకొండ రూ.41.97కోట్ల లక్ష్యానికి రూ.25.84 కోట్లు సాధించి 24వ స్థానంలో ఉన్నాయి. రూ.15.44 కోట్లకు గాను రూ.8.62 కోట్లతో వరంగల్ 27, జనగామ రూ.8.25 కోట్లకు రూ.4.55 కోట్లతో 28వ స్థానాల్లో నిలిచాయి.

తలసరి ఆదాయంలో అంతంతే..



2023-24లోనూ రంగారెడ్డి జిల్లా రూ.10,55,913ల తలసరి ఆదాయంతో రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలవగా.. ఉమ్మడి వరంగల్‌లో ఆరు జిల్లాలు ర్యాంకింగ్‌లో 12 నుంచి 29 స్థానాల్లో ఉన్నాయి. గతేడాదితో పోలిస్తే పర్ క్యాపిటల్ ఇన్‌కం పెరిగినా.. రాష్ట్ర వ్యాప్తంగా వెనుకబడినట్లు గణాంకాలు చెబుతున్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గతేడాది రూ.2,28,655లతో 15వ స్థానంలో ఉండగా.. ఈసారి రూ.2,57,851కు పెరిగినా 12వ స్థానానికి పరిమితమైంది. గతంలో 19వ స్థానంలో ఉన్న ములుగు ఈసారి రూ.2,49,338లతో 15, రూ.2,44,278లతో వరంగల్ 17, జనగామ రూ.2,33,215లతో 19, మహబూబాబాద్ రూ.2,12,232లతో 29వ స్థానాల్లో నిలవగా, హనుమకొండ జిల్లా రూ.1,99,490లతో 32వ స్థానానికి పడిపోయింది. గతేడాది రూ.1,86,618లతో 31వ స్థానంలో ఉన్న హనుమకొండ ఈసారి తలసరి ఆదాయంలో మరో మెట్టు దిగింది.

జిల్లాల వారీగా తలసరి ఆదాయం...(రూ.లలో)


జిల్లా	2020-21	2021-22	2022-23	2023-24
వరంగల్ అర్బన్	1,26,594	1,55,055	1,86,618	1,99,490
వరంగల్ రూరల్	1,65,549	1,95,115	2,20,877	2,44,278
జనగామ	1,66,392	1,86,244	2,21,424	2,33,215
మహబూబాబాద్	1,44,479	1,79,057	2,00,309	2,12,232
జేఎస్.భూపాలపల్లి	2,03,564	2,34,132	2,28,655	2,57,851
ములుగు	1,55,821	1,75,527	2,15,772	2,44,278

అడవుల విస్తీర్ణంలో ములుగు ఫస్ట్..



మొత్తం భౌగోళిక విస్తీర్ణంలో తెలంగాణ అటవీ ప్రాంతం జిల్లాల వారీగా గణనీయంగా మారిన నేపథ్యంలో అత్యధికంగా 64.64శాతం అటవీ విస్తీర్ణంతో ములుగు మొదటి స్థానంలో ఉంది. భద్రాద్రి కొత్తగూడెం (41.38శాతం) రెండో స్థానంలో ఉండగా, ఆ తదుపరి మూడో స్థానంలో 41.15 శాతంతో జయశంకర్ భూపాలపల్లి ఉంది. 26.89 శాతంతో అడవులతో మహబూబాబాద్ తొమ్మిదో స్థానంలో, 4.44 శాతంతో జనగామ 29, వరంగల్ 3.53 శాతంతో 30, హనుమకొండ 3.40 శాతంతో 31వ స్థానంలో ఉంది.

'ఉపాధి' పనిదినాల్లో వెనుకబాటే..



మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలు వెనుకబడి పోయాయి. ఈ ఏడాది జనవరి 24 వరకు కూలీలకు పనులు కల్పించడంలో లక్ష్యాలను చేరుకోలేక 9 నుంచి 29వ స్థానాల్లో నిలిచాయి. ర్యాంకింగ్‌లో వరంగల్ జిల్లా 25.5లక్షల పనిదినాలకు 23 లక్షల పనిదినాలు కల్పించి 89.9 శాతంతో 9వస్థానం, ములుగు 89.8 శాతం పని దినాలతో 10వ స్థానాల్లో నిలిచాయి. అలాగే 89.3శాతం లక్ష్యంతో హనుమకొండ 15, జనగామ 16, జేఎస్ భూపాలపల్లి 88.3 శాతంతో 23, మహబూబాబాద్ 47.6 లక్షల పనిదినాలకు 41.8 లక్షల పని దినాలు జనరేట్ చేసి 87.8 శాతంతో 29వ స్థానంలో నిలిచాయి.

జిల్లాల వారీగా స్థూల జిల్లా దేశీయోత్పత్తి (జీడీడీపీ)(రూ.కోట్లలో..)

జిల్లా	2020-21	2021-22	2022-23	2023-24
వరంగల్ అర్బన్(హనుమకొండ)	16,181	19,877	23,868	25,667
వరంగల్ రూరల్(వరంగల్)	13,901	16,509	18,677	20,758
జనగామ	10,353	11,672	13,875	14,669
మహబూబాబాద్	13,092	16,317	18,245	19,490
జేఎస్.భూపాలపల్లి	10,298	11,848	11,481	12,932
ములుగు	5,382	6,147	7,583	8,873

ఏసీబీకి చిక్కిన సబ్ రిజిస్ట్రార్, ప్రైవేట్ అటెండర్

- గిఫ్ట్ రిజిస్ట్రేషన్‌కు రూ.20 వేలు డిమాండ్
- ఘన్‌పూర్‌లో లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం



లంచం తీసుకుంటూ పట్టుబడిన ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్, అటెండర్

స్టేషన్‌ఘన్‌పూర్: జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్, సీనియర్ అసిస్టెంట్ పర్వతం రామకృష్ణ, ప్రైవేట్ అటెండర్ ఎదునూరి రమేశ్ రూ.20వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన సంఘటన గురువారం జరిగింది. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పర్వతం రామకృష్ణ కొన్ని నెలలుగా స్టేషన్‌ఘన్‌పూర్ ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా, ఎదునూరి రమేశ్ చాలా ఏళ్లుగా ఈ కార్యాలయంలో ప్రైవేట్ అటెండర్‌గా పనిచేస్తున్నాడు. సబ్ రిజిస్ట్రార్‌కు సంబంధించిన లావాదేవీలు రమేశ్ చేతులమీదుగానే నడుస్తుంటాయి. ఈ క్రమంలో చిల్పూరు మండలం వెంకటేశ్వరపల్లెకు చెందిన బట్టమేకల యాదగిరికి శివరాజ్, ధర్మరాజ్ ఇద్దరు కొడుకులు. తండ్రి పేరిట ఉన్న 585 గజాల స్థలంలోని ఇల్లు, ఇంటి స్థలాన్ని పంచుకున్నారు. ఆ ఆస్తిని తమ పేరిట గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేయించాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో శివరాజ్ ఈనెల 17న ఘన్‌పూర్ సబ్ రిజిస్ట్రార్‌ను సంప్రదించగా పార్టీషన్ గిఫ్ట్ డీడ్ చేయమని చెప్పారు. తాను కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడినని, ఇద్దరు అన్నదమ్ములకు చేయాలని కోరినా వినిపించుకోలేదు. తర్వాత రెండు డాక్యుమెంట్లు చేయాల్సి ఉంటుంది.. ఒక్కో డాక్యుమెంట్‌కు రూ.11వేల చొప్పున రూ.22 వేలు ఇస్తే చేస్తామని అటెండర్ రమేశ్ ద్వారా శివరాజ్‌కు చెప్పించారు. అంత ఇచ్చుకోలేనని వేడుకోవడంతో చివరకు రూ.20వేలు ఇవ్వాలని చెప్పడంతో చేసేది లేక వెళ్లిపోయాడు. ఈ క్రమంలో శివరాజ్ 18న హనుమకొండలోని ఏసీబీ అధికారులను ఆశ్రయించి విషయం తెలిపారు. రెండు రోజులుగా నిఘా వేసిన ఏసీబీ అధికారులు గురువారం మధ్యాహ్నం శివరాజ్ ద్వారా సదరు లంచం డబ్బులు సబ్ రిజిస్ట్రార్.. అటెండర్ రమేశ్ ద్వారా తీసుకున్నాడు. అక్కడే మాటువేసి ఉన్న ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా అటెండర్ రమేశ్‌ను, సబ్ రిజిస్ట్రార్ రామకృష్ణను పట్టుకున్నారు. ఈ దాడుల్లో ఏసీబీ సీఐలు సట్ల రాజు, ఎల్.రాజు తదితరులు పాల్గొన్నారు.

OFFICE OF THE SUPERINTENDENT, MGM HOSPITAL - WARANGAL

NOTIFICATION NO: 01/2025

Applications are invited for filling (02) posts of **DENTAL ASSISTANT SURGEON** on Honororium basis under Rajiv Aarogyasri Scheme in MGM Hospital, Warangal.

The application forms may be downloaded from the official website of District Collector's Office, Warangal District from **22-03-2025** to **24-03-2025** till **05.00** PM https://warangal.telangana.gov.in

The filled in application forms along with copies of all necessary documents should be submitted in O/o. Superintendent, MGM Hospital, Warangal. Last date for submission of application is **24-03-2025** till **05.00** PM.

Sd/- **Superintendent, MGM Hospital** | Sd/- **District Collector Warangal**

వరంగల్ మామిడికి ప్రత్యేక గుర్తింపు

- రాష్ట్ర అటవీశాఖ మంత్రి కొండా సురేఖ
- ముసలమ్మకుంటలో మామిడి మార్కెట్ ప్రారంభం



మామిడి మార్కెట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కొండా సురేఖ

వరంగల్: వరంగల్ పండ్ల మార్కెట్ నుంచి ఎగుమతి అయ్యే మామిడికి దేశ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందని రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. గురువారం వరంగల్ ఏనుమాముల మార్కెట్ పరిధిలో గల ముసలమ్మ కుంటలో ఏర్పాటు చేసిన పండ్ల మార్కెట్‌ను వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్.నాగరాజు, వరంగల్ కలెక్టర్ సత్యశారదతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని రైతు సంక్షేమ ప్రభుత్వం ప్రతీ అన్నదాత అభివృద్ధి, సంక్షేమం కోసమే కృషి చేస్తోందన్నారు. ఇప్పటికే వరంగల్ మార్కెట్ నుంచి ఎగుమతి అయ్యే మామిడికి దేశ వ్యాప్తంగా ఆదరణ లభిస్తున్న నేపథ్యంలో సంప్రదాయ(ఆర్గానిక్)పద్ధతిలో సాగు చేసే పండ్లను విక్రయించేందుకు వ్యాపారులు ముందుకు రావాలన్నారు. మామిడి మార్కెట్‌లో మౌలిక వసతుల ఏర్పాటుకు రూ.20 లక్షలు మంజూరు చేస్తున్నామన్నారు. ఈ నిధులతో మార్కెట్ రోడ్డు అభివృద్ధి చేయిస్తామని హామీ ఇచ్చారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్‌నాగరాజు మాట్లాడుతూ మార్కెట్‌లో టాయిలెట్లు నిర్మాణానికి నియోజకవర్గ నిధుల నుంచి రూ.10 లక్షలు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జేడీఎం ఉప్పుల శ్రీనివాస్, డీడీఎం పద్మావతి, డీఎంఓ సురేఖ, మార్కెట్ కార్యదర్శి జి.రెడ్డి, హార్టికల్చర్ అధికారి సంగీతలక్ష్మి, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ఫ్రూట్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు వెల్ది సాంబయ్య, కార్పొరేటర్లు తూర్పాటి సులోచన, అనిల్‌కుమార్, స్థానిక నాయకుడు ఇంతియాజ్, ప్రజాప్రతినిధులు, ట్రేడర్స్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మామిడి క్వింటా రూ.11,220

వరంగల్ ఏనుమాముల పరిధిలోని ముసలమ్మకుంటలో ఏర్పాటు చేసిన మామిడి మార్కెట్‌లో గురువారం తొలిసారి పండ్ల వ్యాపారస్తుల సంఘం అధ్యక్షుడు వెల్ది సాంబయ్య వేలం నిర్వహించారు. ఈ వేలంలో టన్ను మామిడి గరిష్ఠంగా రూ.లక్షా 22వేల ధర పలికింది. క్వింటాకు రూ.11,220కి కొనుగోలు చేశారు.

మహిళా సాధికారతకు ప్రజా ప్రభుత్వం కృషి..

మహిళా సాధికారతకు ప్రజాప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. గురువారం వరంగల్ దేశాయిపేటలో దుర్గాబాయి మహిళాశిశు వికాస కేంద్రం ఆధ్వర్యంలో నిర్మించిన ప్రభుత్వ వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌ను ప్రారంభించారు. 9,462 స్వయం సహాయక బృందాలకు రూ.20 కోట్ల 84 లక్షల 73 వేల బ్యాంక్ లింకేజీ చెక్‌ను అందజేశారు. అనంతరం వరంగల్, ఖిలావరంగల్ మండలాల పరిధిలోని 457మంది కుటుంబాలకు రూ. 4 కోట్ల 87 లక్షల 56 వేల 492 కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మంత్రి సురేఖ, ఎమ్మెల్యే నాగారాజు, కలెక్టర్ సత్యశారద అందజేశారు.

నేటినుంచి 'ఇంటర్' మూల్యాంకనం

- హనుమకొండ జిల్లాకు 2లక్షల 95 వేలు, వరంగల్ జిల్లాకు 3లక్షల 80వేల వరకు జవాబుపత్రాల రాక
- ఇప్పటికే సంస్కృతం మూల్యాంకనం ప్రారంభం

విద్యారణ్యపురి : ఇంటర్మీడియట్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం నేటి (శుక్రవారం) నుంచి నిర్వహించనున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంలో తొలిసారి రెండు చోట్ల క్యాంపులు ఏర్పాటు చేయగా ఇందులో హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వివిధ దశల్లో సబ్జెక్టుల వారీగా మూల్యాంకనం నిర్వహించబోతున్నారు. ఈనెల 21నుంచి మ్యాథ్‌మెటిక్స్, ఇంగ్లిష్, ఈనెల 22నుంచి తెలుగు, సివిక్స్, హిందీ, 24 నుంచి ఫిజిక్స్, ఎకనామిక్స్, 26 నుంచి కెమిస్ట్రీ, కామర్స్, 28 నుంచి హిస్టరీ, బాటనీ, జూవాలజీ సబ్జెక్టుల పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనం నిర్వహించనున్నారు. అయితే ఈ నెల 9నుంచే సంస్కృతం సబ్జెక్టు పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనం నిర్వహిస్తున్నారు. హనుమకొండ జిల్లా క్యాంపునకు అన్ని సబ్జెక్టులు కలిపి పరీక్షల జవాబుపత్రాలు 2 లక్షలు 95వేలు వచ్చాయి. క్యాంప్ ఆఫీసర్‌గా హనుమకొండ జిల్లా డీఐఈఓ ఎ. గోపాల్, అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్ జనరల్-1గా హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె. శ్రీనివాస్‌రావు, జనరల్-2గా అధ్యాపకురాలు మాధవి వ్యవహరిస్తున్నారు. హనుమకొండ, జనగామ, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు చెందిన అధ్యాపకులు ఈ మూల్యాంకనంలో పాల్గొననున్నారు.

ఎల్‌బీ కళాశాలలో మరో క్యాంపు..

ఉమ్మడి వరంగల్‌జిల్లా కేంద్రంలోని వరంగల్‌లోని ఎల్‌బీ కళాశాలలోనూ ఈసారి నూతనంగా ఇంటర్మీడియట్ పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకన క్యాంపు ఏర్పాటుచేశారు. వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ డీఐఈఓ సుమన్ శ్రీధర్ క్యాంపు ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈజిల్లాలో ఇప్పటికే సంస్కృతంతోపాటు మూడురోజుల క్రితం ఇంగ్లిష్ సబ్జెక్టు పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనం కూడా ప్రారంభమైందని సమాచారం. మిగతా సబ్జెక్టుల మూల్యాంకనం దశలవారీగా చేపట్టబోతున్నారు. ఈ జిల్లాలోని క్యాంపునకు 3లక్షల 90వేల వరకు జవాబుపత్రాలు వచ్చాయని సమాచారం.ఈ మూల్యాంకనంలో వరంగల్, మహబూబాబాద్, ములుగు జిల్లాలోని అధ్యాపకులు విధులు నిర్వర్తించనున్నారు.

విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవాలి

- కేయూ రిజిస్ట్రార్ వి. రామచంద్రం



జ్యోతి ప్రజ్వలనలో రిజిస్ట్రార్, అధ్యాపకులు, విద్యార్థినులు

కేయూ క్యాంపస్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఇంజనీరింగ్ విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవాలని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ వి. రామచంద్రం అన్నారు. గురువారం మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో క్యాంపస్‌లోని ఆడిటోరియంలో 'రూబిజెస్ట్- 2025' ఉత్సవాలు నిర్వహిచారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రిజిస్ట్రార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం కూడా ముఖ్యమన్నారు. తమ లక్ష్యాలు నెరవేరాలంటే కష్టపడి చదువుకోవాలన్నారు. రూబిజెస్ట్ కార్యక్రమం ద్వారా ఇంజనీరింగ్ విద్యార్థుల్లో టెక్నికల్ ఈవెంట్స్‌లో ప్రతిభ వెలుగులోకి వస్తుందన్నారు. వ్యోమగామి సునీతా విలియమ్స్‌లా ధైర్యం, ఆత్మవిశ్వాసం అందిపుచ్చుకొని ఇంజనీరింగ్ విద్యలో రాణించాలన్నారు. అకడమిక్ కోఆర్డినేటర్ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ 'రూబిజెస్ట్- 2025' ఉత్సవాలకు వివిధ కళాశాలల విద్యార్థులు తమ ఈవెంట్స్‌కు సంబంధించిన ప్రాజెక్టుల డెమోల ద్వారా ప్రతిభ చూపాచ్చన్నారు. ఉత్సవాల కన్వీనర్ సాయితరుణ్.. టెక్నికల్ ఫెస్ట్ అండ్ కల్చరల్ ఫెస్ట్‌లో నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాల వివరాలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మా బంగారం ఇప్పించండి..

- ఖాతాదారుల డిమాండ్
- రాయపర్తి ఎస్‌బీఐ ఎదుట ఆందోళన



బ్యాంకు అధికారులతో మాట్లాడుతున్న ఖాతాదారులు

రాయపర్తి: బ్యాంకులో తామెంత బంగారం తనాఖా పెట్టామో అంతే ఇప్పించాలంటూ డిమాండ్ చేస్తూ ఖతాదారులు గురువారం రాయపర్తి మండల కేంద్రంలోని ఎస్‌బీఐ ఎదుట ఆందోళన చేపట్టారు. గత సంవత్సరం నవంబర్ 19వ తేదీన రాయపర్తి ఎస్‌బీఐలో ఖాతాదారుల 19 కిలో బంగారం చోరీకి గురైన విషయం విధితమే. ఈ ఘటనలో బ్యాంకు అధికారులు సదరు బంగారంలో తరుగు తీసి డబ్బులు చెల్లిస్తామని కొంతకాలంగా ఖాతాదారులకు చెబుతున్నారు. అయితే ఖాతాదారులు మాత్రం బ్యాంకులో తామెంత బంగారం తనాఖా పెట్టామో అంతే ఇవ్వాలని, లేనిపక్షంలో తరుగు తీయకుండా డబ్బు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలిపి వారి నిర్ణయం మేరకు చర్యలు తీసుకుంటామని, మరో రెండు రోజుల్లో సమాచారం అందజేస్తానమని బ్యాంకు అధికారులు చెప్పడంతో ఖాతాదారులు వెనుదిరిగారు. కాగా, బ్యాంకులో ఎలాంటి గొడవలు జరగకుండా ఎస్సై శ్రవణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు.

నడకతో ఆరోగ్యం..

- డాక్టర్ బాబా ఆదిత్య
- ఎస్సార్‌లో ఘనంగా క్రీడాదినోత్సవం



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న డాక్టర్ బాబా ఆదిత్య

హసన్‌పర్తి: ప్రతీ రోజు 30 నిమిషాలు నడవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని ఐఐటీ, హైదరాబాద్ క్రీడాధికారి డాక్టర్ బాబా ఆదిత్య అన్నారు. హసన్‌పర్తి శివారు అన్నాసాగరంలోని గురువారం ఎస్సార్ యూనివర్సిటీలో 23వ వార్షిక క్రీడోత్సవ వేడుకల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బాబా ఆదిత్య ముఖ్యఅతిథి హాజరై మాట్లాడారు. మానసిక ఒత్తిడి తగ్గించడానికి క్రీడలు ఎంతో దోహదపడుతాయన్నారు. సౌత్‌జోన్ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. ఎస్సార్ యూనివర్సిటీ వీసీ దీపక్ గార్గ్ మాట్లాడుతూ క్రీడలు జీవనంలో కీలక భూమిక పోషిస్తాయన్నారు. యోగా, శారీరక వ్యాయామాన్ని జీవితంలో భాగం చేసుకోవాలన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ అర్చనారెడ్డి, డాక్టర్ వి.వి.సుధాకర్, డాక్టర్ కె. రవీందర్, ఫిజికల్ డైరెక్టర్ పుల్లూరి శ్రీనివాస్, ఫిజికల్ విభాగం కోచ్ కె .సతీశ్, కె. సమ్మయ్య, డి.రవి, బి. జనకీరాముడు, కె. అమూల్య, పి. మాధవి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే భద్రాద్రి రాములోరి తలంబ్రాలు

- ఆర్టీసీ ఆర్ఎం విజయభాను



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ ఆర్ఎం, అధికారులు

హన్మకొండ: భద్రాద్రి సీతారాముల కల్యాణ తలంబ్రాలు ఇంటి వద్దనే అందించనున్నట్లు ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయ భాను తెలిపారు. ఏప్రిల్ 6వ తేదీ భద్రాచలంలో సీతారాముల కల్యాణం జరుగుతుందని తెలిపారు. గురువారం హనుమకొండలోని ఆర్టీసీ వరంగల్ రీజియన్ కార్యాలయంలో సీతారాముల కల్యాణ పోస్టర్‌ను ఆర్ఎం, అధికారులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా వాసులకు ఆర్టీసీ లాజిస్టిక్, పార్సిళ్ల ద్వారా తలంబ్రాలు అందించనున్నట్లు వివరించారు. తలంబ్రాల ఒక్కొక్క ప్యాకెట్‌కు రూ.151 చెల్లించాలన్నారు. ఆర్టీసీ ఆన్‌లైన్‌లో, అన్ని బస్టాండ్‌లోని లాజిస్టిక్స్ సెంటర్లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌ల వద్ద గాని బుక్ చేసుకోవచ్చన్నారు. ఉమ్మడి జిల్లా వాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వరంగల్-1 డిపో ఎగ్జిక్యూటివ్ ఎస్.రామయ్య (9154 298759), వరంగల్-2 డిపో పి.నరేందర్ (9154298763), హనుమకొండ డిపో సతీశ్ కుమార్(9154298761), జనగామ కె.వినాశ్ (9154298762), వి.శివ కుమార్(9154298764), నర్సంపేట పి.నరేందర్ (9154298763), మహబూబాబాద్ ఎస్. వేలాద్రి (9154298768), తొర్రూరు పి.చైతన్య కుమార్ (9154298766), భూపాలపల్లి వి.శివ కుమార్ (9154298764), వరంగల్ రీజియన్ ఎం. నవత (9154298758, 9398411765)ను సంప్రదించాలని ఆర్ఎం కోరారు.

యువర్స్

● ఆర్ట్ అండ్ కల్చర్



రోహిట్

చిన్నప్పటి నుంచి టీవీల్లో డ్యాన్స్ షోలు చూస్తూ డాన్సర్ కావాలనుకునేవాడు రోహిత్ సరాఫ్. వెండితెరపై కుమారుడిని చూడాలని కలలు కనేవాడు అతడి తండ్రి. అయితే తన కల నెరవేరే భాగ్యాన్ని చూడలేదు. రోహిత్ పన్నెండేళ్లు ఉన్నప్పుడు తండ్రి చనిపోయాడు.

'నాన్న ఆత్మకు శాంతి చేకూరాలంటే నేను నటుడిని కావాల్సిందే' అని బలంగా డిసైడైపోయాడు రోహిత్.

దిల్లీ నుంచి ముంబైకి వచ్చిన సరాఫ్ ఒక టీవీ చానల్ యూత్ షోకు హాజరయ్యాడు. కెమెరా ముందుకు రావడం కొత్త ప్రపంచంలోకి అడుగుపెట్టినట్లుగా అనిపించింది.

'బాగా కష్టపడితేగానీ ఇక్కడ నెగ్గుకు రాలేం' అనుకున్నాడు. మొదటి సంవత్సరం రెండు టీవీ షోలలో నటించే అవకాశం వచ్చింది. ఆ తరువాత యాడ్స్‌లో, ఒక సినిమాలో అవకాశం వచ్చింది.

అయితే...తొలి సినిమా షూట్ చేసిన రెండున్నరేళ్ల తరువాత అది ఆగిపోయిందని తెలుసుకున్నాడు. బాగా నిరాశకు గురయ్యాడు. ఆడిషన్స్‌కు కూడా వెళ్లేవాడు కాదు. దీంతో ఎవరి నుంచి పిలుపు వచ్చేది కాదు. మరోవైపు ఆర్థిక ఇబ్బందులు. ఆ చీకటి రోజులలో 'ఇలా అయితే ఎలా?' అని తనకు తానే ప్రశ్న వేసుకున్నాడు. మళ్లీ కష్టపడాలని గట్టిగా అనుకున్నాడు. 'ప్రతిరోజూ కొండంత ధైర్యంతో, కోటి కలలతో నిద్ర లేవాలి అనుకున్నాను' అని గతాన్ని గుర్తు తెచ్చుకున్నాడు.

డియర్ జిందగీ, హిచ్కీ, ది స్కై ఈజ్ పింక్‌లాంటి చిత్రాల్లో అవకాశాలు వచ్చాయి. 'యస్...నాకు భవిష్యత్తు ఉంది' అనే ఆశాకిరణం ఉజ్వలంగా మెరిసింది. నెట్‌ఫ్లిక్స్ సిరీస్ 'మిస్‌మ్యాచ్‌డ్' తన కెరీర్‌కు టర్నింగ్ పాయింట్ అయింది. ప్రస్తుతం మణిరత్నం-కమల్‌హాసన్ సినిమాలో, ధర్మ ప్రొడక్షన్‌లాంటి పెద్ద సంస్థ సినిమాలో నటిస్తున్నాడు. 'కలలు అనేవి పిరికి వాళ్ల కోసం కాదు. ధైర్యంగా ఉండే వ్యక్తుల కోసమే' అంటున్న 28 సంవత్సరాల రోహిత్ సరాఫ్ ఫోర్బ్స్ ఇండియా '30 అండర్ 30' జాబితాలో చోటు సాధించాడు.

ఏకాగ్రత పెరుగుతుంది

చదువు అనేది మహా సముద్రం లాంటిది. మనం నేర్చుకోవడానికి ఎన్నో ఉన్నాయి. మనం ఎప్పుడూ నిత్య విద్యార్థిగా ఉండాలి' క్లాసురూమ్‌లో విన్న ఇలాంటి మాటలు ఎప్పటికప్పుడు కొత్త కోర్సులు నేర్చుకునేలా చేసింది. కొత్త కోర్సులు చేయడం వల్ల ఏకాగ్రత పెరుగుతుంది. ఐఏఎస్ చేయాలనేది నా లక్ష్యం.
- బి. ప్రవల్లిక

175 ఆన్‌లైన్ కోర్సులు
నాన్‌స్టాప్ లెర్నర్



పది విషయాలు నేర్చుకున్నప్పుడు కూడా... నేర్చుకోవడానికి మరో పది విషయాలు రెడీగా ఉంటాయి. 'నేర్చుకోవడానికి నేను రెడీ' అనుకుంటే మీరే విజేత. అలాంటి ఒక విజేత... బి. ప్రవల్లిక. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 175 ఆన్‌లైన్ కోర్సులు పూర్తి చేసి 'ఔరా' అనిపించింది...

విశాఖ జిల్లా భీమిలిలోని 'కస్తూర్బా గాంధీ విద్యాలయం'లో పదవ తరగతి చదువుతున్న బి. ప్రవల్లిక చదువులో ముందుండడమే కాకుండా పలు కోర్సులలో విశేష ప్రతిభ చూపుతూ ప్రశంసలు అందుకుంటోంది. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురానికి చెందిన ప్రవల్లిక తండ్రి కోవిడ్ వల్ల చనిపోయారు. తల్లి ప్రైవేటు కంపెనీలో పని చేస్తోంది.



ఆన్‌లైన్ కోర్సుల హవా...

గతంలో సమగ్ర శిక్ష అభియాన్‌ప్రాజెక్ట్ కోఆర్డినేటర్‌గా పని చేసిన బి.శ్రీనివాసరావు ఇక్కడి విద్యార్థినులు ఆధునిక కోర్సులు నేర్చుకుంటే భవిష్యత్తులో వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందనే ఉద్దేశంతో ఇన్ఫోసిస్ వారి సహకారాన్ని తీసుకున్నారు. కోర్సుల కోసం 20 మందిని ఎంపిక చేశారు. ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డు ఆన్‌లైన్ ప్లాట్‌ఫారం ద్వారా కోర్సులను ఎంపిక చేసుకోవలసి ఉంటుంది. ఎంపిక చేసుకున్న కోర్సులకు సంబంధించిన సమాచారం, సూచనలు అందిస్తారు. ఆ తరువాత ఆన్‌లైన్‌లో నిర్వహించే పరీక్షల్లో పాల్గొనాలి. సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, రోబోటిక్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డేటాబేస్, డ్రోన్... మొదలైన వాటితోపాటు మొత్తం 175 కోర్సులు పూర్తి చేసింది ప్రవల్లిక. కోర్సును బట్టి కొన్ని గంటలు లేదా ఒకటి, రెండు రోజుల్లో నేర్చుకుని పరీక్షల్లో పాల్గొంటూ మంచి మార్కులు పొందుతూ సర్టిఫికెట్లు సాధించింది.

నాడు... నేడు

గత ప్రభుత్వ హయాంలో జరిగిన 'నాడు-నేడు' పనుల ద్వారా ఎన్నో సదుపాయాలు అందుబాటులోకి రావడం వల్ల ఆన్‌లైన్ కోర్సుల అభ్యసనకు వీలు కలిగింది. రూ. 51 లక్షలతో అదనపు గదులు, విద్యార్థినులు ప్రశాంతంగా చదువుకోవడానికి పెద్ద షెడ్డు, అవసరమైన ఇతర సదుపాయాల కల్పన జరిగింది.

'ఆసక్తి ఉన్నచోటే ప్రతిభ ఉంటుంది. ప్రవల్లికకు కొత్త విషయాలపై ఎంతో ఆసక్తి ఉంది. ఆ ఆసక్తే ఆమెను 175 కోర్సులు పూర్తి చేసేలా చేసింది. భవిష్యత్తులో తన చదువుకు ఈ కోర్సులు ఎంతగానో ఉపయోగపడతాయి. 175 కోర్సులు పూర్తి చేయడం అనేది ఆమెకే కాదు విద్యాలయానికి గర్వకారణం' అంటుంది కేజీబీవీ ప్రిన్సిపాల్ గంగా కుమారి.

టార్గెట్... ఐఏఎస్

ఎంతోమంది ఐఏఎస్ అధికారుల విజయగాథలను క్లాస్ రూమ్‌లో వింటున్నప్పుడు ప్రవల్లిక మదిలో 'ఐఏఎస్' కలకు బీజం పడింది. 'లక్ష్యసాధనకు మన ఆర్థిక స్థితిగతులతో పని లేదు. కడు పేదరికంలో పుట్టిన వారు కూడా ఎంతో కష్టపడి తమ లక్ష్యాన్ని నెరవేర్చుకున్నారు. మనకు కావాల్సింది సాధించాలనే పట్టుదల మాత్రమే'... ఇలాంటి మాటలు ఎన్నో ప్రవల్లికకు స్ఫూర్తినిచ్చి 'ఐఏఎస్' లక్ష్యానికి బలాన్ని ఇచ్చాయి.

- సింగారెడ్డి రమణప్రసాద్, సాక్షి, భీమిలి

● గేమింగ్

మెరుపు వీరుడు

'కొండలు, కోనలు మనకి అడ్డంకి కాదు' అనుకునే సాహసికులకు స్వాగతం పలికే గేమ్ ఇది.

మిస్టీరియస్ పాయింట్స్‌ను అవగాహన చేసుకుంటూ అనుభవజ్ఞానాన్ని సొంతం చేసుకునే సాధకులకు దారి చూపే గేమ్ ఇది. గెరిల్లా యుద్ధంలో రాటు తేలిన యోధులకు వీర తిలకం దిద్దే గేమ్ ఇది. యాక్షన్ రోల్-ప్లేయింగ్ గేమ్ అసాసిన్స్ క్రీడ్ షాడోస్ విడుదల అయింది. అసాసిన్స్ క్రీడ్ సిరీస్‌లో వస్తున్న 14వ మేజర్ ఇన్‌స్టాల్‌మెంట్ ఇది. 16వ శతాబ్దంలో సెంగోకు కాలానికి చెందిన కథ నేపథ్యంలో రూపొందించిన ఈ గేమ్‌లో జపాన్ అంతర్యుద్ధ సంఘటనలు కనిపిస్తాయి. తన శక్తియుక్తులతో టకేడా వంశంపై విజయం సాధిస్తాడు ఓడా నోబునాగా. ఒళ్లు గగుర్పొడిచే యుద్ధాలే కాదు నిలువెత్తు కోటలు, అలంకరించబడిన వాస్తు శిల్పాలు, సందడిగా ఉండే ఓడరేవులు... మొదలైనవి ఎన్నో ఈ ఆటలో కనిపిస్తాయి. రకరకాల మిషన్‌ల ద్వారా వివిధ క్యారెక్టర్‌లకు మారే అవకాశం ప్లేయర్స్‌కు ఉంటుంది. సరికొత్త ఫీచర్‌లతో ప్లేయర్స్‌కు సినిమాటిక్ ఫైటింగ్ ఎక్స్‌పీరియన్స్‌ను అందిస్తుంది.

సిరీస్: అసాసిన్స్ క్రీడ్
మోడ్స్: సింగిల్-ప్లేయర్
ప్లాట్‌ఫామ్: ప్లేస్టేషన్ 5, విండోస్, ఎక్స్ బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్/ మాక్ వోఎస్/ఐపాడ్ వోఎస్
జానర్స్: యాక్షన్ రోల్-ప్లేయింగ్



● ఇడియమ్స్

చ్యూ ద కడ్

ఒక విషయం లేదా సంఘటనకు సంబంధించి లోతుగా ఆలోచించడం, విశ్లేషించడానికి సంబంధించి వాడే మాట... చ్యూ ద కడ్. ఉదా: ఆఫ్టర్ దీ మీటింగ్, శ్రీను టుక్ టైమ్ టు చ్యూ ద కడ్ ఆన్ దెయిర్ న్యూ ప్రాజెక్ట్ ప్రపోజల్



ఫోమ్ ఎట్ ద మౌత్

తట్టుకోలేని కోపం, అసహనానికి గురయ్యే సందర్భంలో వాడే మాట... ఫోమ్ ఎట్ ద మౌత్.
ఉదా: ది సీయివో బిగెన్ టు ఫోమ్ ఎట్ ద మౌత్ వెన్ హీ డిస్కవర్డ్ ది ఫైనాన్షియల్ లాసెస్.

● టెక్... టాక్



షావోమీ 15 అల్ట్రా

డిస్‌ప్లే: 6.73 అంగుళాలు
రిఫ్రెష్‌రేట్: 120 హెచ్‌జడ్
మెమోరీ: 256జీబి 12జీబి ర్యామ్/ 512జీబి 16జీబి ర్యామ్
వోఎస్: ఆండ్రాయిడ్ 15
ఫ్రంట్ కెమెరా: 32ఎంపీ
బ్యాటరీ: 5410 ఎంఏహెచ్
రిజల్యూషన్: 1440X3200 పిక్సెల్స్



షావోమీ ప్యాడ్ 7 ప్రో

హైట్: 251.22 ఎంఎం : విడ్త్:173.42 ఎంఎం
బరువు: 500 గ్రా. స్క్రీన్ సైజ్: 11.2
రిఫ్రెష్ రేట్: 144 హెచ్‌జడ్
వోఎస్: షావోమీ హైపర్ వోఎస్ 2
ఫ్రంట్ కెమెరా: 32 ఎంపీ
బ్యాటరీ: 8850 ఎంఏహెచ్
కలర్స్: గ్రే, బ్లూ, గ్రీన్

గెలాక్సీ ఏ సిరీస్

శాంసంగ్ తన పాపులర్ గెలాక్సీ ఏ సిరీస్ కోసం మూడు కొత్త డివైజ్‌లను యాడ్ చేసింది. అవి: గెలాక్సీ ఏ 56, గెలాక్సీ ఏ 36, గెలాక్సీ ఏ26. గెలాక్సీ ఏఐని మరింత యాక్సెస్ చేసే లేటెస్ట్ మిడ్ రేంజ్ శాంసంగ్ స్మార్ట్‌ఫోన్‌లు ఇవి.
గెలాక్సీ ఏ56
8జీబి ర్యామ్ : 128 జీబి స్టోరేజ్
గెలాక్సీ ఏ 36 : 8జీబి ర్యామ్ : 128 జీబి స్టోరేజ్



సాక్షి సినిమా

ధమ ధమ ధమ విశ్వలింగ...


● మోహన్ బాబు

విష్ణు మంచు హీరోగా నటించిన చిత్రం 'కన్నప్ప'. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించిన ఈ మూవీలో ప్రీతీ ముకుందన్ హీరోయిన్‌గా నటించారు. మోహన్‌బాబు, బ్రహ్మానందం, ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్‌లాల్, శరత్ కుమార్, కాజల్ అగర్వాల్ ఇతర కీలక పాత్రలు పోషించారు. మంచు మోహన్‌బాబు నిర్మించిన ఈ మూవీ ఏప్రిల్ 25న విడుదల కానుంది. కాగా మార్చి 19న మోహన్‌బాబు పుట్టినరోజు. ఈ సందర్భంగా 'కన్నప్ప'లో మోహన్‌బాబు చేసిన మహదేవ శాస్త్రి పాత్ర పరిచయ గీతానికి సంబంధించిన గ్లింప్స్ విడుదల చేశారు. 'ధమ ధమ ధమ విశ్వలింగ... ధిమి ధిమి ధిమి విశ్వ లింగ....' అంటూ ఈ పాట సాగుతుంది. స్టీఫెన్ దేవస్సీ స్వరపరిచిన ఈ పాటకు సుద్దాల అశోక్ తేజ సాహిత్యం అందించగా శంకర్ మహదేవన్ ఆలపించారు.

నా హృదయం నిండిపోయింది

- చిరంజీవి



''హౌస్ ఆఫ్ కామన్స్-యుకె పార్లమెంట్‌లోని కొందరు పార్లమెంట్ సభ్యులు, మంత్రులు, అండర్ సెక్రటరీలు, దౌత్యవేత్తలచే గౌరవించబడటం గౌరవంగా భావిస్తున్నాను. నా హృదయం కృతజ్ఞతతో నిండిపోయింది'' అని హీరో చిరంజీవి తెలిపారు. నాలుగున్నర దశాబ్దాలుగా కళారంగానికి, సమాజానికి చిరంజీవి చేసిన సేవలకుగానూ యుకె పార్లమెంట్ హౌస్ ఆఫ్ కామన్స్‌లోని కొందరు ఎంపీలు, మంత్రుల చేతులమీదుగా ఈ నెల 19న(బుధవారం) చిరంజీవికి గౌరవ సత్కారం జరిగింది. అలాగే సినిమా, ప్రజాసేవ, దాతృత్వానికి ఆయన చేసిన కృషిని గుర్తించిన యూకేకి చెందిన 'బ్రిడ్జ్ ఇండియా' అనే సంస్థ తొలిసారి అందించిన 'జీవిత సాఫల్య పురస్కారం' కూడా అందుకున్నారు చిరంజీవి. ఈ సందర్భంగా ఆయన సోషల్ మీడియాలో స్పందిస్తూ-''మాటలు సరిపోవు. అద్భుతమైన ప్రేమాభిమానాలను చూపించే అభిమానులు, రక్త దాతలు, నా సినీ కుటుంబం, శ్రేయోభిలాషులు, స్నేహితులు, నా కుటుంబ సభ్యులు, నా ప్రయాణంలో ఎంతగానో సహకరించిన వారు, నేను మానవతా దృక్పథంతో చేపట్టిన కార్యక్రమాల్లో పాల్గొన్న వారందరికీ థ్యాంక్స్. ఈ గౌరవం నన్ను మరింత ఉత్సాహంతో పని చేయడానికి ప్రేరేపిస్తుంది'' అన్నారు.


● శిరీష్, హర్షిత్, 'దిల్' రాజు, హనీఫ్, హర్షిత, సునీత

మల్టీస్టారర్‌కి శ్రీకారం

ప్రముఖ నిర్మాత 'దిల్' రాజు 'మార్కో' మూవీ చిత్ర దర్శకుడు హనీఫ్ అదేనితో ఓ మల్టీస్టారర్ మూవీకి శ్రీకారం చుట్టారు. శిరీష్ సమర్పణలో 'దిల్' రాజు ప్రొడక్షన్స్‌పై హర్షిత్ రెడ్డి, హన్షిత రెడ్డి నిర్మించనున్న ఈ కొత్త చిత్రాన్ని గురువారం ప్రకటించారు. ''మలయాళంలో బ్లాక్ బస్టర్ అయిన 'మార్కో'తో దర్శకుడు హనీఫ్ అదేని పేరు బాగా ట్రెండ్ అయింది. అలాంటి ఓ క్రేజీ డైరెక్టర్‌తో హై బడ్జెట్‌తో పాన్ ఇండియా మల్టీస్టారర్ ఫిల్మ్‌ని ప్రకటించడం సంతోషంగా ఉంది. ఈ మూవీతో హనీఫ్ తెలుగులోకి ఎంట్రీ ఇస్తున్నారు. గురు ఫిల్మ్స్ సునీత తాటి ఈ ప్రాజెక్ట్‌లో భాగస్వామి అయ్యారు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలోనే తెలియజేస్తాం'' అని మేకర్స్ పేర్కొన్నారు.

భాగ్యనగరం అంతా మనదే మనదే...


● వైష్ణవీ చైతన్య, సిద్ధు జొన్నలగడ్డ

''ఈ పనిని ఇలానే ఎందుకు చేయాలి? మరోలా చేస్తానని కొందరు అంటుంటారు. అలాంటివాళ్లని క్రాక్ అంటుంటాం. 'జాక్: కొంచెం క్రాక్' రైమింగ్‌తోపాటు హీరో క్యారక్టరైజేషన్ కూడా ఈ సినిమాకు ఈ టైటిల్ పెట్టడానికి కారణం అయ్యింది. ఈ సినిమాలో ప్రేక్షకులను నవ్విస్తూనే, బాధ్యతగా ఉండే పాత్రలో కనిపిస్తాను'' అని సిద్ధు జొన్నలగడ్డ అన్నారు. సిద్ధు జొన్నలగడ్డ హీరోగా 'బొమ్మరిల్లు' భాస్కర్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'జాక్: కొంచెం క్రాక్'. వైష్ణవీ చైతన్య హీరోయిన్‌గా నటిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర పతాకంపై బి. బాపినీడు సమర్పణలో బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 10న విడుదల కానుంది. ఈ సినిమాలోని 'కిస్' పాట లిరికల్ వీడియోను గురువారం రిలీజ్ చేశారు మేకర్స్. 'భాగ్యనగరం అంతా మనదే మనదే...' అంటూ ఈ 'కిస్' సాంగ్ సాగుతుంది. ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ- ''ఈ సినిమాలోని హీరో క్యారెక్టరైజేషన్ గురించి భాస్కర్‌గారు చెప్పగానే ఈ సినిమా చేయడానికి ఒప్పుకున్నాను. నేనూ ఓ రైటర్‌ని కాబట్టి కొన్ని ఇన్‌పుట్స్ ఇచ్చాను. భాస్కర్‌గారు ఆయన కథకు అనుగుణంగా డెవలప్ చేశారు'' అన్నారు. ''సిద్ధు యూత్‌కి మాత్రమే కాదు అన్ని ఏజ్‌ల వారికీ స్టార్ బాయ్‌గా మారారు. 'జాక్' సినిమాను భాస్కర్ చాలా చక్కగా హ్యాండిల్ చేశాడు'' అన్నారు బీవీఎస్ఎన్ ప్రసాద్. ఈ చిత్రం పాటల రచయిత సనారె, మ్యూజిక్ డైరెక్టర్ సురేష్ బొబ్బిలి మాట్లాడారు.

శారీ చూశాక అమ్మాయిలు జాగ్రత్త పడతారు

- రామ్‌గోపాల్ వర్మ


● సత్య యాదు, రామ్‌గోపాల్ వర్మ, ఆరాధ్య, గిరి కృష్ణకమల్

''సోషల్ మీడియాలో వ్యక్తిగత విషయాలు షేర్ చేసుకోవడం వల్ల ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది? అనే నేపథ్యంలో 'శారీ' రూపొందింది. నేనే చిత్రానికి మూల కథ రాశాను. గిరి కృష్ణకమల్ దర్శకత్వం వహించాడు. 'శారీ'లో సందేశం ఉంటుందని చెప్పను గానీ, ఈ సినిమా చూశాక అమ్మాయిలు జాగ్రత్త పడతారు'' అని రామ్‌గోపాల్ వర్మ చెప్పారు. సత్య యాదు, ఆరాధ్యా దేవి ప్రధాన పాత్రల్లో గిరి కృష్ణ కమల్ దర్శకత్వం వహించిన చిత్రం 'శారీ'. ఆర్జీవీ, ఆర్వీ ప్రొడక్షన్స్ ఎల్ఎల్‌పీ బ్యానర్‌పై రవిశంకర్ వర్మ నిర్మించిన ఈ సినిమా ఏప్రిల్ 4న తెలుగు, హిందీ, తమిళ, మలయాళ భాషల్లో విడుదలవుతోంది. ఈ మూవీ ట్రైలర్ రిలీజ్ ఈవెంట్‌లో రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ- ''రాజకీయాలు, సినిమాలు వేర్వేరు. ఆంధ్రప్రదేశ్‌లో మా సినిమాకు థియేటర్స్ దొరకవని అనుకోవడం లేదు. ఏదైనా చట్ట ప్రకారమే జరుగుతుంది. పోసాని కృష్ణమురళిగారిని అరెస్ట్ చేస్తే ఆయన సినిమాలు ఆపేయరు కదా? తాము చేస్తున్న యాడ్స్ లీగలా? కాదా? అనేది యాక్టర్స్‌కు, స్టార్స్‌కు తెలియకపోవచ్చు. దానిపై అధికారులు నటీనటులకు అవగాహన కల్పించాలి. అంతేగానీ సడెన్‌గా చర్యలు తీసుకోవడం సరికాదు'' అన్నారు. ''ఆరాధ్య, సత్య బాగా నటించడం వల్ల దర్శకుడిగా నాపై ఒత్తిడి తగ్గింది'' అని గిరి కృష్ణకమల్ చెప్పారు. ''ఈ సినిమాలో నా పాత్ర చిన్నదే అయినా కథలో కీలకంగా ఉంటుంది'' అని సత్య యాదు తెలిపారు.

వినోదాల సింగిల్


● శ్రీవిష్ణు, కేతికా శర్మ

శ్రీవిష్ణు హీరోగా రూపొందుతోన్న చిత్రం '#సింగిల్'. 'నిను వీడని నీడను నేనే' మూవీ ఫేమ్ కార్తీక్ రాజు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో ఇవాన, కేతికా శర్మ హీరోయిన్లు. అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, కళ్యా ఫిల్మ్స్‌పై విద్యా కొప్పినీడి, భాను ప్రతాప్, రియాజ్ చౌదరి నిర్మిస్తున్నారు. ఈ సినిమాని మే 9న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించి, పోస్టర్ రిలీజ్ చేశారు. ''యూత్, ఫ్యామిలీ ఆడియన్స్‌ని అలరించే చిత్రంగా 'సింగిల్' ఉంటుంది. ఈ వేసవిలో శ్రీవిష్ణు తన నవ్వులతో ప్రేక్షకులను అలరించబోతున్నారు. ఆయన పాత్రలోని రెండు డిఫరెంట్ వేరియేషన్స్ ఆకట్టుకుంటాయి'' అని చిత్రయూనిట్ పేర్కొంది. 'వెన్నెల' కిశోర్ కీలక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: విశాల్ చంద్రశేఖర్, కెమేరా: ఆర్. వేల్‌రాజ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: అజయ్ గద్దె.

ఆ ఉద్దేశంతోనే ఈ ఫంక్షన్‌కి వచ్చాను

- బ్రహ్మానందం


● ప్రియాంక, బ్రహ్మానందం, సప్తగిరి

''తమ్ముడు సప్తగిరి సినిమా ఇది. ఒక హాస్య నటుడు సినిమా హిట్ కావాలనే ఉద్దేశంతో ఇక్కడికి వచ్చాను'' అన్నారు బ్రహ్మానందం. సప్తగిరి లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'పెళ్లి కాని ప్రసాద్'. ఈ చిత్రంలో ప్రియాంకా శర్మ హీరోయిన్. అభిలాష్ రెడ్డి గోపిడి దర్శకత్వంలో కేవై బాబు, భాను ప్రకాశ్ గౌడ్, సుక్కా వెంకటేశ్వర్ గౌడ్, వైభవ్ రెడ్డి ముత్యాల కలిసి నిర్మించిన ఈ చిత్రం నేడు (శుక్రవారం) విడుదలవుతోంది. హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన బ్రహ్మానందం మాట్లాడుతూ- ''ప్రేక్షకులను పది కాలాల పాటు నవ్వించాలని తపన పడేవాడు హాస్యనటుడు. హాస్య నటుడిది మనల్ని నవ్వించే వృత్తి. నిజంగా ఇది పవిత్రమైనది. 'పెళ్లికాని ప్రసాద్' సినిమా కోసం సప్తగిరి చాలా కష్టపడ్డాడు. ఈ సినిమాను హిట్ చేసి, హాస్య నటుడికి మంచి జీవితం ఇవ్వాలని కోరుకుంటున్నాను'' అని అన్నారు. ''ఈ సినిమా కాన్సెప్ట్ బాగుంది'' అని మరో ముఖ్య అతిథి, దర్శక-నిర్మాత మారుతి తెలిపారు. ''ఈ సినిమాను తప్పకుండా థియేటర్స్‌లో చూడండి'' అని పేర్కొన్నారు కేవై బాబు.

కోర్ట్ విజయం మాకు హెల్ప్ అవుతుంది

- రాహుల్ రెడ్డి



''కొత్తదనంతో కూడిన మంచి కంటెంట్ ఉన్న చిత్రాలను ప్రేక్షకులు ఆదరిస్తారని నిర్మాతగా నా నమ్మకం. మంచి కంటెంట్‌తో రూపొందించిన మా 'టుక్ టుక్' విజయం పై నమ్మకం ఉంది'' అని రాహుల్ రెడ్డి అన్నారు. హర్ష రోషన్, కార్తికేయ దేవ్, స్టీవెన్ మధు, శాన్వీ మేఘన, నిహాల్ కోదాటి ముఖ్య తారలుగా సి. సుప్రీత్ కృష్ణ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'టుక్ టుక్'. రాహుల్ రెడ్డి, లోక్కు శ్రీవరుణ్, శ్రీరాముల రెడ్డి నిర్మించిన ఈ చిత్రం నేడు (శుక్రవారం) విడుదలవుతోంది. ఈ సందర్భంగా రాహుల్ రెడ్డి మాట్లాడుతూ- ''దర్శకుడు సుప్రీత్‌తో కలిసి 'అలనాటి చిత్రాలు' అనే వెబ్ ఆంథాలజీ చేశాను. సుప్రీత్ చెప్పిన ఫ్యాంటసీ థ్రిల్లర్ కథ నచ్చడంతో 'టుక్ టుక్' నిర్మించాను. రెండున్నర గంటల పాటు నాన్‌స్టాప్‌గా ఎంటర్‌టైన్ చేసే ఫిల్మ్ ఇది. రోషన్ నటించిన 'కోర్ట్' సినిమా మంచి విజయం సాధించింది. ఆ సినిమా సక్సెస్ మాకూ హెల్ప్ అవుతుందని ఆశిస్తున్నాను'' అని అన్నారు.